క్లుప్తంగా

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ మునివేలు

బొమ్మనహాళ్ : ప్రతి ఒక్కరూ రాజ్యాంగంలో ఉన్న చట్టాలపై అవగాహన పెంచుకోవాలని తహసీల్దార్ మునివేలు, ఎస్ఐ నబీరసూల్ సూచించారు. గురువారం మండలంలోని శ్రీధరఘట్ట గ్రామంలోని ఆర్డీటీ కాలనీలో గ్రామస్తులతో పౌరహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలను రక్షించేందుకు రాజ్యాంగంలో ప్రత్యేక చట్టాలు ఉన్నాయన్నారు. ఈ చట్టాలపై అవగాహన ఉండాలని తెలిపారు. అనంతరం వివిధ అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో వీఆర్వో నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

శివయ్య ఆచారి సేవలు మరువలేనివి



శివయ్య ఆచారి దంపతులను సన్మానిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

కూడేరు: గణిత ఉపాధ్యాయుడు వెంకటశివయ్య ఆచారి సేవలు మరువలేనివని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ గణిత ఉపాధ్యాయుడు వెంకట శివయ్య ఆచారి గురువారం ఉద్యోగ విరమణ చేశారు. దీంతో ఆయనకు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆత్మీయ సన్మాన, వీడ్కోలు సభను ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, మండల అధికారులు, బంధుమిత్రులు ఆయనకు శాలువాలు కప్పి, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కుళ్లాయిస్వామి, ఎంఈఓ మహమ్మద్ గౌస్, డిప్యూటీ ఎంపీడీఓ రాధాకృష్ణ, హెచ్ఎం శ్రీదేవి, స్కూల్ కమిటీ చైర్మన్, విద్యార్థులు పాల్గొన్నారు.

30 మంది యువకుల రక్తదానం



రక్తదాతలకు సర్టిఫికెట్లను అందిస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో సూర్యవంశి సైనిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో 30 మంది యువకులు రక్తదానం చేశారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు యువత ముందుకొచ్చి రక్తదానం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఫౌండేషన్ సభ్యులు ప్రవీణ్, సంజయ్, సుధీర్, యశ్వంత్ తెలిపారు. రాయదుర్గం ఏరియా ఆస్పత్రి బ్లడ్ స్టోరేజ్ వైద్య సిబ్బంది రక్తం సేకరించినట్లు చెప్పారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

కూడేరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 2న ఉదయం 10:30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కుళ్లాయిస్వామి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు, సర్పంచులు, అధికారులు హాజరుకావాలని ఎంపీడీఓ తెలిపారు.

పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

రాయదుర్గంటౌన్: రాయదుర్గంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. సివిల్, మెకానికల్ ఇంజినీరింగ్ డిప్లొమా కోర్సుల్లో మిగిలిన సీట్లను స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 5లోపు పదో తరగతి ఉత్తీర్ణులైన వారు కళాశాలలో దరఖాస్తులు అందజేసి, ప్రవేశం పొందొచ్చన్నారు. వివరాలకు సెల్: 9010222165 లో సంప్రదించాలని కోరారు.

ఇస్కాన్‌లో వ్యాసరచన పోటీలు

అనంతపురం కల్చరల్: నైతిక విలువలను పెంపొందిస్తూ శ్రీకృష్ణుడి విశేషాలను తెలియజేయడమే లక్ష్యంగా చిన్నారులకు పోటీలు నిర్వహిస్తున్నామని ఇస్కాన్ జిల్లా ఇన్‌చార్జ్ దామోదర గౌరంగదాసు తెలిపారు. శ్రీకృష్ణాష్టమి వేడుకలను పురస్కరించుకుని గురువారం ఇస్కాన్ మందిరంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు వేర్వేరుగా జరిగిన పోటీల్లో శ్రీమద్భాగవతంలోని ఘట్టాలు, భగవద్గీత విశిష్టతను చిన్నారులు అద్భుతంగా వివరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో బహుమతులు అందజేయడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

అడ్రస్ లేని ఆహార సలహా కమిటీలు

- రేషన్ దుకాణాలపై కొరవడిన పర్యవేక్షణ
- సరుకుల పంపిణీలో అవకతవకలు
- పట్టించుకోని అధికారులు



ఉరవకొండలోని ఓ రేషన్ షాపులో నిత్యావసరాలు అందిస్తున్న దృశ్యం

ఉరవకొండ: రేషన్ దుకాణాల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసి, నిరుపేదలకు నిత్యావసరాలు సక్రమంగా అందేలా పర్యవేక్షించాల్సిన ఆహార సలహా కమిటీలు ఎక్కడా కనిపించలేదు. ప్రస్తుతం ఈ సంఘాల పర్యవేక్షణ లేక అధికారులు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో తూకాల్లో మోసం జరగడమే కాకుండా పేదలకు నిత్యావసర వస్తువులు సక్రమంగా అందడం లేదని ప్రజలు చెప్తున్నారు.

ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల పరిధిలో 504 చౌక దుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలో ఇప్పటి వరకు ఏఏవై కార్డులు 16,745, తెల్లకార్డులు 1,84,770 మొత్తం 201,515 రేషన్ కార్డులు ఉన్నాయి. ప్రతి నెలా 6,33,123 కేజీల బియ్యం సరఫరా అవుతుంది. ప్రస్తుతం కొత్తగా సుమారు 8 వేల మంది కొత్త కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆహార సలహా కమిటీ చైర్మన్‌గా జిల్లా స్థాయిలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్, మండల స్థాయిలో తహసీల్దార్ వ్యవహరిస్తారు. సభ్యులుగా ఎంపీడీఓ, జెడ్పీటీసీలు, పాత్రికేయులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులను నామినేట్ చేస్తారు.

ఇష్టారాజ్యంగా పంపిణీ:

ఆహార సలహా సంఘాలు అడ్రస్ లేకపోవడంతో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నాణ్యతను పట్టించుకోవడం లేదు. ఆహార సలహా కమిటీ ప్రతి మూడు నెలలకు ఒక సారి సమావేశం నిర్వహించేది. మండల స్థాయిలో రేషన్ దుకాణాలపై అధికారులు కూడా సమీక్షించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకుండా పోవడంతో కూటమి ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. దుకాణాల్లో మోసం జరుగుతున్నా అడిగే వారు లేరు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎండీయూ వాహనాల ద్వారా వలంటీర్ల పర్యవేక్షణలో ఇంటింటికీ వెళ్లి రేషన్ అందించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వ్యవస్థ పూర్తిగా గాడి తప్పింది.

తూకాల్లో పెద్ద ఎత్తున మోసాలు



ఆహార సలహా సంఘాల పర్యవేక్షణ లేకపోవడంతో రేషన్ షాపుల్లో బియ్యం, తదితర నిత్యావసర సరుకుల తూకాల్లో తేడాలు వస్తున్నాయి. దీంతో ప్రభుత్వం ఆహార సలహా సంఘ సమావేశాలు ఏర్పాటు చేసి, పేదలకు న్యాయం జరిగేలా చూడాలి.

– ఏసీ పార్వతమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు, ఉరవకొండ

ఎలాంటి ఆదేశాలు లేవు



ఆహార సలహా సంఘాలు ఏర్పాటు చేసేలా ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. అయితే రెవెన్యూ అధికారులు రేషన్ షాపులపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఎక్కడా అవకతవకలు లేకుండా చూస్తున్నారు.

– మహబూబ్‌బాషా, తహసీల్దార్, ఉరవకొండ

చంద్రబాబు మాటలు నమ్మి మోసపోయాం



పథకాలపై ఆరా తీస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కణేకల్లు: ఎన్నికలప్పుడు చంద్రబాబు మాటలు నమ్మి ఓట్లేసి మోసపోయామని మహిళలు అన్నారు. గురువారం మండలంలోని కళేకుర్తి గ్రామంలో 'బాబూ ష్యూరిటీ... మోసం గ్యారెంటీ' కార్యక్రమం జరిగింది. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాటిల్ బ్రహ్మానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఉషారాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి పాటిల్ నాగిరెడ్డి, గ్రామ సర్పంచు భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ మారెన్న ఇంటింటా వెళ్లి కూటమి సర్కారు ఇచ్చిన హామీలు నెరవేర్చిందా? ఏ పథకాలు మీకు అందుతున్నాయని ఆరా తీశారు. సూపర్‌సిక్స్ పథకాలు తమకు అందలేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. జగనన్న పాలనే తమకు బాగుండేదని చంద్రబాబు మాటలను నమ్మి మోస పోయామని మహిళలు పేర్కొన్నారు. పింఛన్, అరకొరగా తల్లీకి వందనం తప్ప ఇతర పథకాలేవీ కూటమి సర్కారు ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో గోపులాపురం సర్పంచు ప్రకాష్‌చౌదరి, పెనకలపాడు వైస్ సర్పంచు గలిబే అనిల్‌కుమార్, వివిధ అనుబంధ సంఘాల నేతలు ఆర్కే బద్రీ, గోపులాపురం కృష్ణారెడ్డి, మల్రెగౌడ్ శశి, కురుబ వన్నూరుస్వామి, నాగరాజు, చిన్న సర్మాస్, హనుమంతు, జయచంద్రారెడ్డి, మణికంఠ, లాలుస్వామి తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం



హనిమిరెడ్డిపల్లిలో బదిలీ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

కుందుర్పి: మండలంలోని అప్పిలేపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు ఈరప్ప, ఉపేంద్రను సిబ్బంది గురువారం సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయులు ఎంతో కృషి చేశారని సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓలు తిప్పేస్వామి, ఓబుళపతి, సర్పంచ్ అతావుల్లా, పాఠశాల కమిటీ చైర్మన్ తిమ్మరాజు, హైస్కూల్ హెచ్ఎం బీసీ, తిమ్మప్ప, ఏపీటీఎఫ్ నాయకులు బొమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎంఈఓకు సన్మానం : బదిలీ అయిన ఎంఈఓ–1 ఓబుళపతి స్థానంలో రాయదుర్గం హైస్కూల్ హెచ్ఎం శంకరయ్య గురువారం బాధ్యతలు చేపట్టారు. ఏపీటీఎఫ్ నాయకులు తిమ్మప్ప, బొమ్మయ్య, ఈరప్ప, రామప్ప, మంజునాథ్ తదితరులు నూతన ఎంఈఓను సన్మానించారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

బెళుగుప్ప: మండల పరిధిలోని హనిమిరెడ్డిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్ఎం శ్రీనివాసమూర్తి అధ్యక్షతన ఉపాధ్యాయులను గురువారం సన్మానించారు. పాఠశాలలో పనిచేసి బదిలీ అయిన ఉపాధ్యాయులు గాయిత్రి, హారిక, రేణుక, భారతి, నల్లపురెడ్డి, హరినాథ్‌బాబును ఉపాధ్యాయులు సన్మానించారు.

ప్రతి ఉద్యోగికీ విరమణ సహజం



ఎంపీహెచ్ఈఓ శ్రీరాములును సన్మానిస్తున్న వైద్యులు, సిబ్బంది

వజ్రకరూరు: ప్రతి ఉద్యోగికీ విరమణ తప్పనిసరి అని వైద్యాధికారులు తేజశ్వి, సర్దార్‌వలి తదితరులు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో ఎంపీహెచ్ఈఓ శ్రీరాములు పదవీ విరమణ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం ఎంపీహెచ్ఈఓ శ్రీరాములు మాట్లాడారు. కార్యక్ర మంలో చాబాల సర్పంచు మల్లెల జగదీష్, ఎంఈఓ ఎర్రిస్వామి, సీహెచ్ఓ లక్ష్మీదేవి, ఎంపీహెచ్ఈఓ గురుప్రసాద్, జాతీయ అవార్డు గ్రహీత బెంజిమెన్, సూపర్‌వైజర్లు నాగశంకర్, సుశీలమ్మ, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసులు సేవలు మరువలేనివి



తహసీల్దార్ శ్రీనివాసులను సన్మానిస్తున్న దృశ్యం

కుందుర్పి: కుందుర్పి తహసీల్దార్ శ్రీనివాసులు సేవలు మరువలేనివని డిప్యూటీ తహసీల్దార్ తిప్పేస్వామి, ఎంపీపీ కమలమ్మ తదితరులు కొనియాడారు. గురువారంతహసీల్దార్ ఉద్యోగ విరమణ సందర్భంగా రెవెన్యూ సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీల నాయకులు డీలర్లు తహసీల్దార్‌ను సన్మానించారు. ఉద్యోగ విరమణ చేసిన అప్పిలేపల్లి వీఆర్ఓ తిమ్మయ్యను గ్రామస్తులు, రైతులు సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచులు మూరుతేశ్వరీ,అతావుల్లా, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ ఎంఈఓగా సోమశేఖర్



ఎంఈఓగా బాధ్యతలు చేపట్టిన సోమశేఖర్

గుమ్మఘట్ట: మండల విద్యావనరుల కేంద్రంలో ఇన్‌చార్జ్ ఎంఈఓగా సోమశేఖర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. కళ్యాణదుర్గం ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సోమశేఖర్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఉపాధ్యాయులు ఆయన్ను సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాయదుర్గం ఎంఈఓ నాగమణి, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పౌరహక్కులకు భంగం కలిగిస్తే చర్యలు



పొట్టిపాడులో పౌరహక్కులదినోత్సవంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ దామోదర్‌రెడ్డి తదితరులు



పౌర హక్కులపై అవగాహన కలిస్తున్న అధికారులు



అంకంపల్లిలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించిన అధికారులు

వజ్రకరూరు: పౌర హక్కులకు ఎవరైనా భంగం కలిగిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ దామోదర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ కేశవరెడ్డి తెలిపారు. గురువారం మండల పరిధిలోని పొట్టిపాడులో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భం గా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ పౌర హక్కులకు ఎవరైనా భంగం కగిలిస్తే వెంటనే ఫిర్యాదు చేయాలన్నారు. పౌరహక్కులపై ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. చట్టాలపైనా తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వో భరత్, హాస్టల్‌వార్డెన్లు ,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు

బ్రహ్మసముద్రం : సమాజంలో ఎవరి హక్కులకు భంగం కలిగించొద్దు అని తహసీల్దార్ ఆర్ .సుమతి, ఎంపీడీఓ రంగనాయకులు అన్నారు. గురువారం మండలంలోని బుడిమేపల్లి గ్రామంలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ కలిసి ఉండాలన్నారు. పౌరులకు ఉన్న హక్కులు, చట్టాలపై తెలుసుకోవాలన్నారు. సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరి సహకారం అవసరమన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ నాగిరెడ్డి, హాస్టల్ వార్డెన్ శ్రీనివాసులు, వీఆర్వో హనుమంతరావు, పంచాయతీ కార్యదర్శి యోగేష్ , మహిళా పోలీస శ్రీజా, వైస్ ఎంపీపీ బాధ పల్లప్ప, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీలు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన

బెళుగుప్ప : మండల పరిధిలోని అంకంపల్లి గ్రామంలో తహసీల్దార్ అనిల్‌కుమార్ అధ్యక్షతన పౌరహక్కుల దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. మండల ఎస్ఐ శివ, ట్రైనీ ఎస్ఐ మహేష్, ఎంపీడీఓ లక్ష్మీనారాయణలతో కలసి నిర్వహించిన కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీలు అన్యాయానికి గురయితే పోలీసులను ఆశ్రయించాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ శివరంజని, హెచ్‌డభ్లూఓ అశ్వత్థామ, విఆర్ఓ ఎర్రిస్వామి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



కుళ్లిన కోళ్ల వ్యర్థాలతో అవస్థలు

ఉరవకొండ రూరల్: పట్టణ శివారులో చెక్‌పోస్ట్ సమీపంలో రోడ్డు పక్కన వ్యర్థాలతో స్థానికులు, వాహదారులు అవస్థలు పడుతున్నారు. స్థానికంగా ఉన్న చికెన్ షాపుల నుంచి తెచ్చిన కోళ్ల వ్యర్థాలు, కుళ్లిన కాయగూరలు, పండ్లను రోడ్డపక్కన పడేస్తున్నారు. దీనికితోడు వర్షం వచ్చి వ్యర్థాలు కుళ్లి దుర్వాసన వస్తోంది. స్థానికులు అనారోగ్యం బారిన పడుతున్నారు. వాహనదారులు కూడా దుర్వాసన భరించలేకపోతున్నారు. ఆ ప్రాంతంలో వ్యర్థాలు వేయకుండా దుకాణదారులకు ఆదేశాలు జారీ చేస్తామని పంచాయతీ ఈవో గౌస్ సాహెబ్ తెలిపారు.



ముళ్ల కంపలతో దర్శనమిస్తున్న ఓపెన్ జిమ్

నిరుపయోగంగా ఓపెన్ జిమ్

ఉరవకొండ రూరల్: పట్టణంలో విద్యుత్ కార్యాలయం వెనుక భాగంలో ఓపెన్‌జిమ్ నిరుపయోగంగా ఉంది. జిమ్ పరికరాలకు గ్రీజింగ్ చేయకపోవటంతో అవి కాస్త తుప్పు పడుతున్నాయి. పట్టణంలో ఓపెన్ జిమ్ ఉందన్న విషయం చాలా మందికి తెలియదు.అధికారులు ఓపెన్ జిమ్ పట్ల అవగాహన కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. జిమ్ కాస్త మూలన పడక ముందే అధికారులు స్పందించి, సక్రమంగా నిర్వహించేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఉరవకొండ మేజర్ పంచాయతీ కార్యదర్శి గౌస్‌సాహెబ్‌ను అడగ్గా, జిమ్ పరిసరాలను శుభ్రం చేయించి, పరికరాలను అందుబాటులోకి తెస్తామని తెలిపారు.

వద్రవన్నూరులో పడకేసిన పారిశుధ్యం



పాచిపట్టిన మురుగునీటి అవస్థలు పడుతున్నట్లు చూపుతున్న కాలనీవాసులు

రాయదుర్గంటౌన్: మండలంలోని వద్రవన్నూరులో పారిశుధ్యం పడకేసింది. కేవలం అధికారులు పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం.. అందరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి అని స్వచ్ఛ ఆంధ్ర.. స్వర్ణ ఆంధ్ర ప్రచారం చేసి, ప్రకటనలకే పరిమితయ్యారని ప్రజలు విమర్శిస్తున్నారు. గ్రామాల్లో పారిశుధ్యలోపంతో అనారోగ్యంబారిన పడుతున్నా పట్టించుకునేవారులేరని ప్రజలు విమర్శిస్తున్నారు. వద్రవన్నూరు గ్రామంలో పారిశుధ్యం లోపించి, మురుగునీరు రోడ్లపైనే పారుతోంది. గ్రామంలోని కురుబ కాలనీ, పాఠశాల సమీపంలోని ప్రధాన రహదారిపై మురుగునీరు నిల్వ ఉంటోంది. ఇళ్ల ముందు రోడ్లు కాలువలను తలపిస్తున్నాయి. అంతేకాక రోజుల తరబడి నిల్వ ఉండి పాచి పట్టి అనారోగ్యానికి దారి తీస్తోంది. దుర్వాసన భరించలేకపోతున్నామని , దోమల బెడద అధికంగా ఉందని ప్రజలు వాపోతున్నారు. అండర్ డ్రైనేజీ సౌకర్యం ఉన్నా చాలా రోజులుగా బ్లాక్ కావడంతో మురుగు ముందుకు సాగకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని ప్రజలు చెప్తున్నారు.

బసవేశ్వర ఆలయ నిర్మాణానికి ప్రతిపాదనలు



కల్లేశ్వరస్వామి ఆలయంలో ఫ్లోరింగ్ పనుల కోసం కొలతలు తీసుకొంటున్న అధికారులు

కణేకల్లు: మండల పరిధిలోని మాల్యంలోని కల్లేశ్వరస్వామి, బసవేశ్వరస్వామి ఆలయాలను దేవదాయశాఖ అధికారులు గురువారం సందర్శించారు. కల్లేశ్వరస్వామి ఆలయంలో ఫ్లోరింగ్ పనుల కోసం ప్రతిపాదనలు రూపొందించేందుకు దేవదాయశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హరిత, దేవదాయశాఖ అధికారి దేవదాస్‌లు చుట్టూ కొలతలు తీసుకున్నారు. అనంతరం బసవేశ్వరస్వామి ఆలయ గోపులాపుర నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఆలయాల్లో చేపట్టాల్సిన పనులపై గ్రామపెద్దలు గాజుల విజయ్, చంద్రశేఖర్ గౌడ్, శరబన్నగౌడ్, మహేష్‌గౌడ్, కృష్ణ, శశి, బసవన్నగౌడ్, నరేంద్రస్వామి తదితరులతో చర్చించారు.

ఫుట్‌బాల్ పోటీల్లో 'దుర్గం' బాలికల ప్రతిభ

కళ్యాణదుర్గం రూరల్: రాష్ట్ర స్థాయి జూనియర్ బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో అనంతపురం జిల్లా జట్టు విజయం సాధించింది. మూడు రోజుల క్రితం తిరుపతిలో జరిగిన బాలికల రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ క్రీడలో అనంతపురం జిల్లా జట్టు కడప జట్టుపై విజయం సాధించింది. ఈ పోటీల్లో కళ్యాణదుర్గానికి చెందిన విద్యార్థినులు ఉష, తనుశ్రీ, జోత్స్న పాల్గొని ప్రతిభ కనబరిచారు. జట్టు విజయంలో దుర్గం బాలికలు కీలకపాత్ర పోషించారని కోచ్ శివ తెలిపారు.

నేటికీ అందని పాఠశాల కిట్లు

రాయదుర్గంటౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాసంవత్సరం ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా నేటికీ స్కూల్ కిట్లు అందలేదు. రాయదుర్గం అర్బన్, రూరల్ పరిధిలో ప్రభుత్వ 78 పాఠశాలలు ఉండగా 14,472 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇప్పటి దాకా 13,871 మంది విద్యార్థులకు స్కూల్ కిట్లు (యూనిఫాం, బ్యాగ్, షూస్, నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు) అందగా, మిగిలిన 601 మంది విద్యార్థులకు సరఫరా కాలేదు. కొత్తగా చేరిన విద్యార్థులు విధి లేని పరిస్థితుల్లో బయట మార్కెట్‌లో బ్యాగులు, నోట్ పోస్తకాలు కొనుగోలు చేయాల్సి వస్తోంది. పాఠ్య పుస్తకాలు అందకపోవడంతో నూతన విద్యార్థుల్లో ఆందోళన నెలకొంది. వారి చదువులు సక్రమంగా కొనసాగలేదు.

కనుల పండువగా పల్లకీ ఉత్సవం



వజ్రకరూరులోని షిర్డీసాయిని అలంకరించిన దృశ్యం

వజ్రకరూరు: స్థానిక షిర్డీసాయి ఆలయంలో గురువారం సాయంత్రం పల్లకీ ఉత్సవం కనులపండువగా జరిగింది. ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలతోపాటు అభిషేకాలు, తీర్థప్రసాద వినియోగం ,అర్చనలు, మహా మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం, హారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం పల్లకీ ఉత్సవం వైభవంగా జరిగింది.

ఇన్‌చార్జ్ ఆర్ఎంగా డిప్యూటీ సీటీఎం శ్రీలక్ష్మి

అనంతపురం క్రైం: ఆర్టీసీ ఆర్ఎం సుమంత్ ఆర్. ఆదోని గురువారం ఉద్యోగ విరమణ పొందారు. ఆయన స్థానంలో ఇన్‌చార్జ్‌గా డిప్యూటీ సీటీఎం శ్రీలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ఆర్టీసీ ఉద్యోగులు, డీఎంలు, ఇతర కేడర్ సిబ్బంది ఆర్ఎంకు వీడ్కోలు పలికారు. ఆర్ఎం సుమంత్ ఆర్.ఆదోని అందించిన సేవలను కొనియాడుతూ సన్మానించారు.

నేడు 'అమరమ్' పుస్తకావిష్కరణ

అనంతపురం కల్చరల్: స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శుక్రవారం తెలుగు వెలుగు సాహితీ సామాజిక సేవా సంస్థ తెలుగు వెలుగు వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరగనున్నాయి. ఈ మేరకు నిర్వాహకులు తోట నాగరాజు గురువారం వివరాలు వెల్లడించారు. వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా సామాజిక ఉద్యమకారుడు, కవి టీవీరెడ్డి రచించిన ×అమరమ్₹ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్నట్లు తెలిపారు. జిల్లా సాహిత్యానికి వన్నె తెస్తున్న సాహితీమూర్తులను సన్మానించడం జరుగుతుందన్నారు.